సంక్షిప్తం



కనిమెట్ట వద్ద రోదిస్తున్న కూలీలు

53 మంది కూలీలకు గాయాలు

కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద బొలెరో బోల్తా పడి 35 మందికి..

జడ్చర్ల మండలం పెద్దఆదిరాల వద్ద ట్రాక్టర్ బోల్తా పడి 18 మందికి..

కనిమెట్ట ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం

7



తగ్గిన దిగుబడి.. పెరిగిన ధర

గత ఏడాది కన్నా తగ్గిన ఉల్లి సాగు

అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట

మార్కెట్లో గతం కంటే పెరిగిన రేటు

7

కొనుగోళ్లేవి?



మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వద్ద ఆరబోసిన ధాన్యం

- ఆశించిన మేర జరగని ధాన్యం సేకరణ
- పచ్చి వడ్లను పొలం వద్దే కొంటున్న దళారులు
- క్వింటాలుకు రూ.2,000 నుంచి రూ.2,200 మాత్రమే ధర
- కర్ణాటకలోని రాయిచూర్ మార్కెట్‌కు తరలుతున్న వడ్లు
- దిగుమతుల అగ్రిమెంట్లకు మిల్లర్ల ససేమిరా
- ప్రభుత్వం పౌరసరఫరాల పాలసీని మార్చడంతో ఇబ్బందులు

మహబూబ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతేడాది వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడితే.. ఈ ఏడాది దండిగా వర్షాలు కురిసి.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోడానికి రైతులు అరిగోస పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. పేరుకు ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభిస్తున్నప్పటికీ.. ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదు. ఫలితంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారు. కర్ణాటక సరిహద్దుల్లోని రైతులు రాయిచూర్‌కు తరలిస్తున్నారు. ఈ సీజన్ నుంచి సన్న ధాన్యం సేకరణపై రూ.500 బోనస్ ప్రకటించినప్పటికీ.. అసలు కొనుగోళ్లే చేపట్టకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీన్ని అదునుగా చేసుకున్న దళారులు.. రైతుల పొలం వద్దనే కొనుగోలు చేస్తూ, సన్న ధాన్యానికి రూ.2,000 నుంచి రూ.2,200 వరకు ధర ఇస్తున్నారు. దీనివల్ల రైతులు సన్న ధాన్యంపై ఒక్కో క్వింటాలుకు రూ.600 నుంచి రూ.800 వరకు కోల్పోతుంటే, దొడ్డు రకాలు సాగు చేసిన వారు రూ.200 నుంచి రూ.300 వరకు నష్టపోతున్నారు. కొంతమంది రైతులు రోడ్లపై ఆరబెట్టగా, మరికొందరు సేకరణ కేంద్రాలకు తెచ్చి ఎప్పుడు కొంటారా? అని ఎదురుచూస్తున్నారు.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం

గతంలో నుంచి కూడా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న రైతులు ధాన్యాన్ని రాయిచూర్ మార్కెట్‌కు తరలించడం సర్వసాధారణమే. అప్పట్లో ఇక్కడ ఇచ్చే ధర కంటే ఎక్కువ వస్తుండటం, డబ్బులు

(మిగతా 6లో..)

మహబూబ్‌నగర్ డీఈవోగా ప్రవీణ్‌కుమార్

- గద్వాల జిల్లాకూ ఆయనే
- ఇన్‌చార్జి విద్యాధికారికి అన్నీ సవాళ్లే..



ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 12: మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డీఈవోగా వికారాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరక్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ ఈ.వెంకటనర్సింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. మహబూబ్‌నగర్‌తో పాటు అదనంగా జోగుళాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జి డీఈవో బాధ్యతలు కూడా అప్పగించారు. మహబూబ్‌నగర్ మాజీ ఇన్‌చార్జి డీఈవో ఎ.రవీందర్ గత గురువారం ఓ ఉపాధ్యాయురాలి సీనియారిటీ జాబితా విషయంలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడిన విషయం తెలిసిందే.

ఇవీ సమస్యలు..

మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డీఈవోగా నియమితులైన ప్రవీణ్‌కుమార్ ముందు అన్నీ సవాళ్లే ఉన్నాయి. పాలమూరు జిల్లాలో గతంలో జరిగిన ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్ల, ప్రైవేట్ స్కూల్స్‌కు ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు ఇవ్వడం తదితర సమస్యలు ఎదురుకానున్నాయి. బదిలీల సందర్భంగా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల విషయంలో చేసిన తప్పిదాలపై చర్యలు తీసుకోకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల నుంచి ఒత్తిళ్లు రానున్నాయి.

బాధిత మహిళలకు భరోసా

● ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్, ఎస్పీ

మహబూబనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు రక్షణ కల్పించి, అండగా నిలబడేందుకు భరోసా కేంద్రాలు ఉపయోగపడతాయని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. చాలామంది మహిళలు, అన్యాయానికి గురైన బాలికలు పోలీస్ స్టేషన్‌లలో చెప్పుకోలేని సమస్యలను భరోసా కేంద్రాలలో చెప్పుకునేందుకు స్వేచ్ఛ ఉంటుందన్నారు. బాధితుల సమస్యలకు పరిష్కారం లభించడంతోపాటు న్యాయం జరుగుతుందని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ డి.జానకితో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో చక్కటి భవనాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ఇక్కడే షీటీమ్ కార్యాలయం కూడా ఏర్పాటు చేయడం శుభపరిణామమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల రక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తు చేశారు. అత్యాచారాలు, అఘాయిత్యాలకు గురైన మహిళలు, బాలికలకు, పోక్సో కేసు బాధితులకు ఈ సెంటర్ ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీ సుకుంటారన్నారు. బాధితులు ధైర్యం గా ఈ కేంద్రాలను ఆశ్రయించాలని సూచించారు. మెగా ఇన్ఫ్రాస్టక్చర్ కంపెనీ భరోసా సెంటర్‌ను రూ.2 కోట్లతో నిర్మించడం అభినందనీయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భరోసా సెంటర్‌ను ఆశ్రయించే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ బాధితులు ఎదుర్కొంటున్న శారీరక, మానసిక, సామాజిక, చట్టపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, అడిషనల్ ఎస్పీ ఏ.రాములు నాయకులు, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి హేయం



వినతిపత్రం తీసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

పాలమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఐఏఎస్, కాడా అధికారి వెంకట్‌రెడ్డిలపై దాడి చేయటం హేయమైన చర్య అని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజీవ్‌రెడ్డి, ఆర్.చంద్రానాయక్, కృష్ణమోహన్ అన్నారు. దాడికి నిరసనగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి నిరసన తెలుపుతున్న ఉద్యోగుల వద్దకు వచ్చి వినతి పత్రం తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సంఘటనను ఖండిస్తున్నట్లు తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో భాగస్వామ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని ప్రసంగించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, పీఆర్‌టీయూ మదన్‌మోహన్, యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేష్ తదితర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లిక్.. క్లిక్.. పడమటి సంధ్యారాగం



అస్తమిస్తున్న సూర్యుడు

సాయం సంధ్య వేళ సూర్యుడు కనువిందు చేశాడు. పసిడి కిరణాలను ఆకాశమంతా విరజిమ్ముతూ, కొండల్లోకి జారుకుంటూ ఆకట్టుకున్నాడు. పూర్తిగా అస్తమయం అయ్యాక ఆకాశం నీలిరంగులోకి మారింది. వనపర్తి మండలం చిట్యాల నుంచి అచ్యుతాపుర్ వెళ్లే దారిలో కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' మంగళవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



కొండల వెనక్కి వెళ్తున్న సూర్యుడు

రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం

● ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు

పాలమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికారం పొందటంతోనే సంపూర్ణ న్యాయం లభిస్తుందని ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్‌హాలులో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ కావాలనే అంశంపై సదస్సు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. చిరంజీవులుతో పాటు ఐఏఎస్ అకాడమీ ఫౌండర్ రవి కుమార్, ప్రజాపతి, శాంతికుమార్, బెక్కెం జనార్ధన్, వకీలు బీమయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ బీసీలు చైతన్యం కావాలని, ఎన్నో ఏళ్లుగా రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనున్న కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్నారని గుర్తుచేశారు. నేటి పరిస్థితులు బీసీలకు అనుకూలంగా ఉన్నాయని, ఐకమత్యంతో పోరాడి అధికారాన్ని సాధించుకోవాలని అన్నారు. మూడు శాతం ఉన్న అగ్రవర్ణాలు ఈడబ్ల్యుఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్ పొందితే, 50 శాతం పైన ఉన్న బీసీలకు కేవలం 27 శాతం ఇవ్వడం అమానుషమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇచ్చినప్పుడు బీసీలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కుటుంబ సమగ్ర సర్వేను ఎవరూ సులువుగా తీసుకోకుండా పూర్తి వివరాలు అందించి, ప్రభుత్వానికి సహకారం ఇవ్వాలన్నారు. తెలంగాణలో ఉన్న 134 కులాల బీసీల సమూహం ఒకటే కులం.. అదే బీసీ కులం అని అన్నారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో బీసీలు అన్యాయానికి గురవుతున్నారని ఐఏఎస్ అకాడమీ ఫౌండర్ రవికుమార్ ప్రజాపతి అన్నారు. బీసీలు ప్రశ్నిస్తే, మాట్లాడితే అవి తిట్లుగా భావిస్తున్నారని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు అన్నారు. కార్యక్రమంలో సారంగి లక్ష్మీకాంత్, మహేందర్, లక్ష్మణ్‌గౌడ్, రమేష్‌గౌడ్, శివాని, శివలీల, బాలమణి, బుగ్గన్న పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు

గంటల తరబడి నిరీక్షణ

- సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల బారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



తిప్రాస్‌పల్లి దగ్గర బారులు తీరిన వాహనాలు



ట్రాక్టర్ కింద సేద తీరుతున్న రైతులు

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పత్తి విక్రయించడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శని, ఆదివారాలు సెలవు కేంద్రాలు బంద్ కావడం, సోమవారం సమ్మెతో మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు చేపట్టడంతో రద్దీ పెరిగింది. దాంతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఐదు మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. మంగళవారం ఆయా మిల్లుల వద్ద రోడ్లపై పత్తి లోడుతో ఉన్న వాహనాలు బారులు తీరాయి. వానాకాలంలో జిల్లాలో 1,65,150 ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేశారు. 9,90,900 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మక్తల్ మార్కెట్ యార్డు పరిధిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కేవలం 20,022.55 క్వింటాళ్ల పత్తిని మాత్రమే మద్దతు ధర రూ.7,521కు కొనుగోలు చేశారు. నారాయణపేట మార్కెట్ పరిధిలోని మిల్లుల్లో 18,453.55 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు.



పత్తి లోడ్‌తో నిలిచిన వాహనాలు

న్యూస్ బాక్స్

ఆంధ్రప్రాంత ఉద్యోగుల రిలీవ్

పాలమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రాంత ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కె.రామచంద్ర(కర్నూల్), కె.వేణుగోపాల్ (కర్నూల్), కె.వెంకటేశులు(అనంతపురం), కె.సూర్యనారాయణ(కర్నూల్), ఆర్.నరసింహ(నల్గొండ-తెలంగాణ)ను రిలీవ్ చేస్తూ ఆర్డర్ జారీ చేయటంతో బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ మంగళవారం మీడియా ఎదుట హర్షం వ్యక్తం చేశారు.

స్టెనో, టైపిస్ట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహబూబ్‌నగర్‌లో స్టెనో, టైపిస్ట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ బి.పాపిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైపిస్ట్ పోస్టు ఒకటి జనరల్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులు రెండు(ఒకరు బీసీ మహిళ, ఒక ఎస్సీ మహిళ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా కోర్టు మహబూబ్‌నగర్ పేర దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గ్రూప్ 3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ సిక్తా పట్నాయక్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నారాయణపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను మంగళవారం ఆదేశించారు. జిల్లాలో మొత్తం 13 కేంద్రాలను ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. పరీక్షలకు 4,200 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, తహసీల్దార్‌లు, మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు కేంద్రాలను తనిఖీ చేయాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● సమగ్ర కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్రంలోని నాలుగు, ఐదు వార్డుల్లో జరిగిన సర్వేను పరిశీలించారు. ఆమె వెంట కమిషనర్ సునీత, టీపీవో కిరణ్ ఉన్నారు.

కొనుగోళ్లేవి?

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఇస్తుండటంతో అమ్మేవారు. కానీ ప్రస్తుతం మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ.. ధాన్యాన్ని కర్ణాటక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇంకా పూర్తి స్థాయిలో వరి కోతకు రాలేదు. ముందుగా వేసుకున్న పంట మాత్రమే వస్తోంది. కానీ, అప్పటివరకు కొనుగోలు కేంద్రాల్లో సేకరణ వేగం పెంచకపోతే రైతులు మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో అత్యధికంగా వరిసాగులోకి వచ్చింది. దాదాపు 13 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. కానీ పరిస్థితి చూస్తే అందులో సగమైనా ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.



వనపర్తి జిల్లా జగత్‌పల్లి సేకరణ కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు

పాలసీలో మార్పులే కారణం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం అప్పులు తెచ్చి, సేకరించిన ధాన్యాన్ని ఎలాంటి పూచికత్తు లేకుండా మిల్లర్లకు అప్పగిస్తుంటే.. వారు సమయానికి సీఎంఆర్ అప్పగించడం లేదు. పైగా గోల్‌మాల్ చేస్తున్నారని భావించి, కొన్ని మార్పులు చేసింది. దీని ప్రకారం డీఫాల్ట్ మిల్లులకు జరిమానాలు విధించగా, ధాన్యం కేటాయించే మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని సూచించిన విషయం తెలిసిందే. అలాగే మిల్లింగ్ ధరలను కూడా పెంచింది. క్వింటాల్ ధాన్యంపై ఇవ్వాల్సిన బియ్యాన్ని తగ్గించడ లేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైస్‌మిల్లర్లు అగ్రిమెంట్లు చేసుకోవడానికి ఎక్కడా ముందుకు రావడం లేదు. ఉదాహరణకు జోగుళాంబ గద్వాల జిల్లాలో 61 రైస్ మిల్లులు ఉండగా, అందులో 11 మిల్లులు డీఫాల్ట్ కింద ఉన్నాయి. 20 రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. 30 మిల్లులకు క్లియరెన్స్ ఉన్నప్పటికీ వాటికి బ్యాంకు గ్యారంటీలు అడుగుతున్నారు. అలాగే సీఎంఆర్ పెండింగ్ ఉన్న 20 మిల్లులకు సెక్యూరిటీ డిపాజిట్‌తోపాటుపాటు 25 శాతం ఫైన్ అడుగుతున్నారు. దీంతో రైస్ మిల్లర్లు ముందుకు రాక, అగ్రిమెంట్లు జరగడం లేదు. ఇక్కడ ఇప్పటివరకు 59 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. నారాయణపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లో కూడా అగ్రిమెంట్లు కావడం లేదు. అగ్రిమెంట్లు అయితేనే రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే అవకాశం ఉంది. లేకపోతే సేకరించిన ధాన్యం కల్లాల్లోనే మిగిలిపోనుంది.

ఆలస్యం చేస్తే రైతులు ఆగం..

పౌరసరఫరాల పాలసీని మార్చే క్రమంలో ఆ మంత్రిత్వశాఖ ఆలస్యం చేయడమే కొనుగోళ్లలో జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సీజన్ ముంచుకొస్తున్న దశలో పాలసీలో మార్పులు చేయడంతో మిల్లర్లు అందుకు ఒప్పుకోవడానికి చాలా సమయం తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆ మార్పుల ప్రకారమే నడుచుకుంటుందని తేల్చిచెబుతుండటంతో పాటు బ్యాంకు గ్యారంటీలు, సెక్యూరిటీ డిపాజిట్లు, జరిమానాలపై వెనక్కి తగ్గడం లేదు. ఎలాగూ రైతుల నుంచి ఒత్తిడి వస్తే తమనే పిలిచి ధాన్యం కేటాయిస్తారనే భావనతో మిల్లర్లు కూడా మొండికేస్తున్నారు. అటు దళారుల రంగ ప్రవేశంతో రైతులు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం అధికార వ్యవస్థ మొత్తం సామాజిక ఆర్థిక, రాజకీయ, కుల సర్వేతోపాటు.. ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారిస్తారా? లేదా అనేది వేచిచూడాలి. ఇప్పటికే రైతుబంధు రాకపోవడం, రుణమాఫీ అమలులో నెలకొన్న ఆటంకాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతాంగం.. కొనుగోళ్ల అవస్థలతో రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని పలువురు భావిస్తున్నారు.

న్యాక్ టీం వచ్చేసరికి సర్వం సిద్ధం చేయాలి



పీయూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

● వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): న్యాక్ టీం వచ్చేసరికి సర్వం సిద్ధం చేయాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో నిర్వహించిన పీయూ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలలో ఏ డేటా అప్లోడ్ చేశామో దానికి సంబంధించిన డాక్యుమెంట్స్ సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఆయా క్రైటిరియా కో ఆర్డినేటర్స్ అవసరమైన డాక్యుమెంట్స్ సరిచూసుకోవాలన్నారు. న్యాక్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. న్యాక్ గ్రేడింగ్ పెరిగితే పీయూకి మరిన్ని నిధులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ నూర్జహాన్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంకం భాస్కర్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ బషీర్ అహ్మద్, వివిధ క్రైటీరియల కో ఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని తిరుమాలపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న జే ధనుష్ 400 మీటర్ల రన్నింగ్, ఏడవ తరగతి చదువుతున్న జే రాజేశ్ ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఖమ్మ జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. వారిని ఉపాధ్యాయుడు పాల్, పీఈటీ రాములు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు పెద్దఆదిరాల విద్యార్థులు

జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో ఈ నెల 15న జరగబోయే 68వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు జడ్చర్ల మండలం పెద్దఆదిరాల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినీ స్వాతికరెడ్డి ఎంపికయ్యింది. పాఠశాల 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి స్వాతికరెడ్డి ఈ నెల 2న, 5న జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో హైజంప్ పోటీలకు ఎంపికయ్యిందని పీఈటీ మోయిన్ తెలిపారు. పాఠశాల ఆవరణలో స్వాతికరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అతిథి అధ్యాపకుల ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల , బీఎడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల భర్తీకి అర్హులైన నిరుద్యోగ, రిటైర్డ్ అధ్యాపకులు దరఖాస్తు చేసుకోగా, వారికి మంగళవారం డైట్ , బీఎడ్ కళాశాలల్లో అభ్యర్థులకు ఎంపికలకు సంబంధించి విద్యార్థుల పాఠ్యబోధన, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఆర్జేడీ విజయలక్ష్మి, నాగర్‌కర్నూల్ డీఈవో బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు, మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయం ఏడీ అనసూయ, డైట్ ప్రిన్సిపాల్ మొరజుల్లాఖాన్ తదితరులు పరిశీలించారు. బోధన ఆధారంగా ఎంపికలు నిర్వహించారు.

కేజీబీవీలో పనిచేయని సోలార్ హీటర్

● చన్నీటితో స్నానం చేస్తున్న విద్యార్థినులు

● అస్వస్థతకు గురై ఆస్పత్రికి..



పీహెచ్‌సీకి వచ్చిన కేజీబీవీ విద్యార్థినులు

దామరగిద్ద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోనిఒ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సమస్యలతో విద్యార్థినీలు అవస్థలకు గురవుతున్నారు. పాఠశాలలో 200 మంది, కళాశాలలో 180 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో పాఠశాలలోనే చదువుతున్నారు. ప్రభుత్వం దుప్పట్లు, యూనిఫామ్స్ పంపిణీ చేయలేదు. దీనికి తోడు సోలార్ హీటర్ ఏర్పాటు చేసినా నిరుపయోగంగా పడింది. ఈ కారణంగా బాలికలు ఉదయం 4 గంటలకు లేచి చలిలో చల్లటి నీటితో స్నానం చేయడంతో జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతులో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. వారం రోజులుగా 15 నుంచి 20 మంది దాకా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్‌తో చూయించుకుని మందులు తీసుకెళ్తున్నారు. పాఠశాల బయట సెప్టిక్ ట్యాంక్ సరిగా నిర్మించకపోవడంతో రోడ్డుపై వెళ్లే వారికి దుర్వాసన వస్తుందంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి కీర్తి మాట్లాడుతూ.. జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గుతో విద్యార్థులు బాధపడుతున్నట్లు తెలిపారు. తాము ఇచ్చిన మందులు కూడా సమయం ప్రకారం విద్యార్థినులకు ఇవ్వడం లేదన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ మాట్లాడుతూ సోలార్ హీటర్ పని చేయకపోవడంతో విద్యార్థినులు ప్రతి రోజు చల్లటి నీళ్లతో స్నానం చేస్తున్నారని తెలిపారు.



పని చేయని సోలార్ హీటర్



చిన్నపొర్లలో స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా పాండురంగ స్వామి రథోత్సవం

ఊట్కూర్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొర్లలో వెలిసిన పాండురంగస్వామి రథోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద స్వామి వారి రథానికి పూలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, యువతులు హారతులతో స్వాగతం పలుకుతూ రథాన్ని లాగారు. భక్తులంతా రథాన్ని లాగుతూ బస్టాండ్ సమీపం వరకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం సందడిగా మారింది. రాత్రి ఆలయం వద్ద భజనలు చేశారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

- భార్య హిమబిందుతో పాటు ప్రియుడు చంటి, మరొకరి రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి భర్త రాత్లావత్ రాజు(30)ను హత్య చేసిన ఘటనలో భార్య హిమబిందు, ప్రియుడు చంటి, అతని స్నేహితుడు కుర్ర రాజేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. వెల్దండ మండలం ఎంజీ తండాకు చెందిన రాత్లావత్ రాజు, అదే తండాకు చెందిన హిమబిందును తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఏడాదిగా హిమబిందు చంటి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. ఈ విషయం రాజుకు తెలియడంతో ఈ నెల 5వ తేదీన భార్యను, ఆమె ప్రియుడు చంటిని మందలించాడు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజును హత్య చేయాలని అతని భార్య, ఆమె ప్రియుడు చంటి పథకం పన్నారు. వ్యవసాయ పొలం దగ్గర రాజు అతని భార్య మంచంపై పడుకుని ఉండగా, చంటి, అతని స్నేహితుడు కొర్ర రాజేష్ పొలం దగ్గరికి వెళ్లారు. హిమ బిందును లేపుకుని పక్కకు వచ్చి తన దగ్గర తెచ్చుకున్న సుత్తెతో నిద్రలో ఉన్న రాజు తలపై కొట్టాడు. నిద్రలో నుంచి లేచిన రాజు తిరగబడడంతో హిమబిందు, చంటి, స్నేహితులు రాజేష్ కలిసి రాజు రెండు కాళ్లు పట్టుకోగా రాజు ముఖం, తలపై చంటి బలంగా కొట్టి చంపాడు. కొంచెం దూరం శవాన్ని తీసుకెళ్లి పడేశారు. మంచమంతా రక్తం కావడంతో మంచం కడిగి అక్కడే పెట్టి సుత్తె తీసుకుని చంటి అతని స్నేహితుడు రాజేష్‌లు వెళ్లిపోయారు. ఆ తర్వాత హిమబిందు తన భర్త కనిపించడం లేదని మృతుడి అన్న లాలూకు ఫోన్ చేసి చెప్పిందని తెలిపారు. మృతుని తండ్రి రాత్లావత్ వాస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి, పోలీస్ సిబ్బంది ఆగమేఘాల మీద దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంతో ఎస్పీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి, పోలీస్ సిబ్బంది కిశోర్‌రెడ్డి, మురళీకృష్ణ, జానకిరాం, ఆంజనేయులు, నవీన్‌యాదవ్, అమర్ సింగ్, సందీప్‌లను అభినందించారు.

చెత్త శుద్ధి ఏదీ?

- తడి, పొడి చెత్త వేరు మాటే లేదు
- నాగర్‌కర్నూల్ డంపింగ్ యార్డులో చెత్తను తగులబెడుతున్న సిబ్బంది
- పొగతో ఇబ్బంది పడుతున్న రైతులు, స్థానికులు



నాగర్‌కర్నూల్ : చందాయపల్లి శివారు డంపింగ్ యార్డు వద్ద పారబోసిన తడి, పొడి చెత్త

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజలు తడి, పొడి చెత్త వేరుచేసే మాటేలేదు అంతా కలిపివేస్తున్నారు. మెరుగైన శానిటరీ, పర్యావరణ హితం విధానాలను అనుసరించాల్సి ఉండగా చెత్త సేకరణలో ఎన్నో లోపాలున్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో తడి, పొడి చెత్త వేరు ప్రక్రియ జరుగకపోవడం ప్రధాన సమస్యగా మారింది. మునిసిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి చెత్త వేరు చేయు విధానాన్ని అమలు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ అచరణలో సాధ్యం కావడం లేదు. చెత్త వేరు ప్రక్రియ జరగకపోవడం వల్ల డంపింగ్ యార్డు వద్ద చెత్తను తగలబెడుతున్నారు. దీంతో పరిసర ప్రాంత రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నాగర్‌కర్నూల్ పట్టణ సమీపంలోని చందాయపల్లి శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్ద తడి,పొడి చెత్త వేరు చేసే యంత్రమే కనిపించడం లేదు. వేరు చేసిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేయాల్సి ఉండగా గోతులు తవ్వి అందులో చెత్త వేసి వదిలేశారు. దీంతో వర్మీ కంపోస్టు ప్రక్రియ జరగడం లేదు. నిత్యం టన్నుల కొద్ది వచ్చే చెత్తను యార్డులో స్థలం లేక రాశులుగా పోసి తగలబెడుతున్నారు. దీంతో వచ్చే పొగ కారణంగా సమీపంలోని రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తగలబెట్టకుండా వర్మీ కంపోస్టు తయారీ ప్రక్రియను చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది



డంపింగ్ యార్డును వ్యవసాయ పొలాల మధ్య ఏర్పాటు చేశారు. మురిగిన చెత్త అంతా రోడ్డు పక్కనే పోస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. చెత్తను తగులబెట్టడంతో వచ్చే పొగ నుంచి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

- తీగల భాస్కర్, రైతు, నాగర్‌కర్నూల్

పర్యావరణం కాపాడాలి



చెత్త సేకరణలోనే మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తడి, పొడి చెత్త వేరుగా అందించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. డంపింగ్ యార్డు వద్ద చెత్త నిర్వహణ పద్దతులను అమలు చేయాలి. సేకరించిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలి.

- వావిలాల రాజశేఖర్‌శర్మ, సామాజిక కార్యకర్త, నాగర్‌కర్నూల్

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్ష రాసేందుకు నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి ఉండదని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షలు నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్ష రాసేందుకు అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందే రావాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి ఉండదని తెలియజేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గుర్తింపు కార్డు ఒరిజినల్ తీసుకు రావాలని తెలియజేశారు. బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను, హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డు తప్ప మరే విధమైన వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పేజర్స్, టాబ్లెట్స్, పెన్‌డ్రైవ్ , బ్లూటూత్ , గడియారం, గణిత టేబుల్, లాగ్ పట్టికలు, పర్స్, పరీక్ష ప్యాడ్, నోట్ బుక్స్ లేదా విడి పేపర్లు, ఆభరణాలు (మంగళసూత్రం, గాజులు తప్ప) హ్యాండ్ బ్యాగులు, పౌచ్‌లు తీసుకుని రావద్దని తెలిపారు. ఒకవేళ డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్ బ్లర్‌గా ఉన్నా , ఫొటో సరిగ్గా కనిపించకపోయినా (3)పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో వెబ్‌సైట్‌లో పెట్టిన ప్రోఫార్మలో అండర్ టేకింగ్ లెటర్ పై గెజిటెడ్ అధికారి సంతకం తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు నిర్వహించే సమయాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. పరీక్షలకు సంబంధించిన ఏదైనా సమస్యలు వస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 08545-233525 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలియజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ తేజావత్ రామదాసు, వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలుగును తరలిస్తున్న ముఠా అరెస్ట్

-11 మంది రిమాండ్‌కు తరలింపు
- మరో ఇద్దరు నిందితుల పరారీ
- నాగర్‌కర్నూలు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా నల్లమల ప్రాంతంలో అలుగు (అడవి జంతువు)ను విక్రయించేందుకు తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. ఈ ఘటనలో 13 మంది నిందితులు కాగా, 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అటవీశాఖ పర్యాటక వనమాలిక వద్ద సీబీఈటీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎఫ్‌వో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన నల్లమలలో పట్టుకున్న అలుగు అమ్మకం, కొనుగోలు చేసే రెండు పార్టీలు అచ్చంపేట మండలం హాజీపూర్‌లో డీల్ చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ముఠాను పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. అలుగును స్వాధీనం చేసుకొని కొనుగోలు చేస్తున్న జడ్చర్ల ప్రాంతానికి చెందిన గంజి బాలరాజును, విక్రయించేందుకు వచ్చిన పదర మండలంలోని పిల్లిగుండ్ల పెంటకు చెందిన శీలం బుడ్డయ్య, శీలం అంజయ్య భాను ప్రసాద్, మద్దిమడుగు గ్రామానికి చెందిన నిమ్మల భాను ప్రసాద్, నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లోని చెంచు కాలనీకి చెందిన శీలం ఈదయ్యను అదుపులోకి తీసుకొని మన్ననూరులోని అటవీశాఖ డివిజన్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. జడ్చర్లకు చెందిన బాలరాజు అలుగును విక్రయించేందుకు మధ్యవర్తిగా దందా కొనసాగిస్తుండగా, ఈయనతో పాటు అచ్చంపేట ప్రాంతానికి చెందిన పురం సాయికుమార్, గౌతమ్, కల్వకుర్తికి చెందిన రమేష్, సంగారెడ్డి జిల్లాకు చెందిన స్వాతి అనే మహిళలు ఒక ముఠాగా ఏర్పడి ఈ దందాకు పూనుకున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని డీఎఫ్‌వో స్పష్టం చేశారు. ఈ నెల 5వ తేదీన పదర మండలం శీలం బుడ్డయ్య నేతృత్వంలో మద్దిమడుగు అటవీ రేంజ్‌లోని చుక్కల గుండం ప్రాంతంలో అలుగును పట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఈ ఘటనలో మొత్తం 13 మంది పాత్ర ఉన్నట్లుగా గుర్తించారు. పై వారితో పాటుగా పదర మండలానికి చెందిన మండ్లి వీరయ్య, చిగుర్ల అంజి, జెల్ల బయ్యన్నలు సైతం అలుగు అమ్మే బృందంలో నింధితులుగా గుర్తించారు. 11 మందిని మంగళవారం సాయంత్రం రిమాండ్ చేసి జడ్జి ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కల్వకుర్తికి చెందిన రమేష్, మండ్లి వీరయ్యలు పరారీలో ఉన్నారని, వీరిని సైతం పట్టుకునేందుకు అటవీ అధికారుల బృందం సోదాలు నిర్వహిస్తోందని తెలిపారు. నాలుగు మాసాల క్రితం రెండు సార్లు అలుగును అక్రమ రవాణా చేశారనే సమాచారం ఉందని, తాజాగా ఈ నెల 11న రంగారెడ్డి జిల్లాలోనూ ఒక అలుగు దొరికిందని, ఇక్కడి ముఠాకు సైతం అలుగు విక్రయించే దందాలో పాత్ర ఉన్నట్లుగా తెలుస్తోందని వివరించారు. పూర్తి విచారణ తర్వాత ఇది ఎక్కడికి రవాణా చేస్తున్నారు, దీంట్లో ప్రధాన పాత్రధారులెవరో నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని డీఎఫ్‌వో వివరించారు. సమావేశంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, అచ్చంపేట, అమ్రాబాద్ ఎఫ్‌డీవోలు తిరుమల్‌రావు, రామమూర్తి పాల్గొన్నారు.



అలుగును మార్కెటింగ్ చేస్తున్న నిందితులతో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, అటవీ అధికారులు

పటిష్టమైన పునాదులతో టీడీపీ నిర్మాణం

● పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు

వనపర్తి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పటిష్టమైన కార్యకర్తల సభ్యత్వాల పునాదులపై నిర్మితమైన టీడీపీ నేటికి రాష్ట్రంలో బలంగా ఉందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బొలెమోని రాములు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమానికి బక్కని నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలకు టీడీపీ రాజకీయంగా తోడుగా నిలవడమే కాకుండా, రాజకీయ చైతన్యం తీసుకొచ్చిందని అన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత కూడా టీడీపీదేనని అన్నారు. తెలుగు దేశం పిలుస్తోందిరా! కదలిరా! అన్న నినాదంతో రాష్ట్ర ప్రజలకు పక్కా గృహాలు, రూ.2కిలో బియ్యం, జనతా వస్త్రాలు ప్రవేశ పెట్టి, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన పార్టీ తెలుగు దేశమే అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతీఒక్కరు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు విధిగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని అధిక సంఖ్యలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. నియోకవర్గ కన్వీనర్లు కొల్లాపూర్ సుధాకర్ నాయుడు, అలంపూర్ సుధాకర్‌గౌడ్, గద్వాల గోవిందు, వనపర్తి వెంకటయ్య యాదవ్, నాగర్‌కర్నూల్ కొప్పుల రమేష్, అచ్చంపేట సత్యం, కల్వకుర్తి యాది లాల్, నాయకులు ఎండీ దస్తగిరి, షాకీర్ హుస్సేన్, హోటల్ బలరాం, బాలరాజు, గోపాలకృష్ణ నాయుడు, కోమరిగిరి, శంకర్, బాలయ్య తదితరులు ఉన్నారు.



ఆన్‌లైన్ ద్వారా టీడీపీ సభ్యత్వాలు అందిస్తున్న బక్కని నరసింహులు, రాములు

స్పోర్ట్స్ బాక్స్

కొనసాగుతున్న జోనల్ స్పోర్ట్స్ మీట్

» పాల్గొంటున్న 680 మంది విద్యార్థులు



పోటీలో తలపడుతున్న జడ్చర్ల, నారాయణపేట జట్లు

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ రెండవ రోజుకు చేరింది. ఈ పోటీల్లో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ఎనిమిది బాలికల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 680 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో 11 రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. టోర్నీలో భాగంగా ఖోఖో అండర్-19 విభాగంలో జడ్చర్ల, ఊట్కూరు జట్లు, ఫుట్‌బాల్ అండర్-17 విభాగంలో జడ్చర్ల, నారాయణపేట జట్లు, కబడ్డీ అండర్-14 విభాగంలో మరికల్, నారాయణపేట జట్ల మధ్య పోటీలు జరిగాయి. వీటితో పాటు మరికొన్ని విభాగాల్లో పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల అనంతరం ఈ 14న ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత వెల్లడించారు.

గో-గేమ్ టోర్నీలో విజేతలుగా నిలవాలి

» మహబూబ్‌నగర్ 37వ వార్డు కౌన్సిలర్ స్వప్న



గో-గేమ్ జట్టు సభ్యులతో అసోసియేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 12 : జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీలో ప్రతిభ చాటి, విజేతలుగా నిలవాలని పాలమూరు 37వ వార్డు కౌన్సిలర్ స్వప్న అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ గో-గేమ్ టోర్నీలో పాల్గొనేందుకు రాష్ట్ర బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ షకీల్ అహ్మద్, కార్యదర్శి అఫ్రోజ్, అర్జున్ పాల్గొన్నారు.

ఈనెల 15న హాకీ పురుషుల జట్టు ఎంపిక

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్ (ఆంధ్రజ్యోతి) 12 : హాకీ పురుషుల జట్టు ఎంపిక పోటీలను ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ గేమ్స్ కోసం, వనపర్తి బాలుర కళాశాల మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడులోని డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్ జోన్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.



ది బూడిదపాడు గ్రామంలో ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

తగ్గిన దిగుబడి పెరిగిన ధర

» గత ఏడాది కన్నా తగ్గిన ఉల్లి సాగు » అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట
» మార్కెట్లో గతం కంటే పెరిగిన ధర » రైతులకు ఉపశమనం

ఉండవల్లి, నవంబరు 12 (ఆంధ్యజ్యోతి) : ఈ ఏడాది ఉల్లి దిగుబడి తగ్గింది. ధర మాత్రం గత సంవత్సరం కన్నా కొంత పెరిగింది. దీంతో రైతుల పరిస్థితి కొంత ఖేదం.. కొంత మోదం అన్నట్లుగా ఉంది. గత రెండేళ్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఉల్లి సాగు చేసిన రైతులు నష్టాలను మూటకట్టుకున్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఉంటుందేమోనన్న సందేహంతో ఎక్కువ మంది రైతులు ఉల్లి సాగుకు ఆసక్తి చూపలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది. దీనికి తోడు అధిక వర్షాలు కురవడంతో వేసిన పంట చాలా వరకు దెబ్బతిన్నది. దీంతో దిగుబడి కూడా గతం కంటే తగ్గింది.

తగ్గిన సాగు విస్తీర్ణం

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది 1,251 మంది రైతులు 2012 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. అత్యధికంగా అలంపూర్ మండలంలో 806, మానవపాడు మండలంలో 226 ఎకరాల్లో సాగయ్యింది. ఉండవల్లి మండలంలో గత ఏడాది 423 మంది రైతులు 745 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. ఎకరాకు దాదాపు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కానీ సరైన ధర రాకపోవడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది 398 మంది రైతులు 665 ఎకరాల్లో మాత్రమే ఉల్లి సాగు చేశారు. పంట చేతికి అందే సమయంలో అధిక వర్షాలు కురవడంలో తెగులు ఆశించి దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చింది. సాగు ఖర్చు ఎకరానికి 50 వేలకు పైగా అయ్యిందని రైతులు చెప్తున్నారు. అయితే గత ఏడాది రూ. 2,500 నుంచి మూడు వేల రూపాయల వరకు ధర పలికింది. అది కూడా కొద్ది రోజులు మాత్రమే కొనసాగింది. ఈ ఏడాది నెల రోజులుగా స్థిరంగా ఉంటోంది. కనిష్ఠం రెండు వేల రూపాయల నుంచి గరిష్ఠం నాలుగు వేల రూపాయల వరకు ధర పలుకుతోంది. ఉల్లి సాగు ఖర్చు, పెట్టుబడి ఎక్కువైనా, వచ్చిన దిగుబడికి మంచి ధర పలుకుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మంచి ధర పలికింది



జి. రఘునాథ్ రెడ్డి, రైతు, ఉండవల్లి : మూడు సంవత్సరాలుగా ఉల్లి పంటను సాగు చేస్తున్నాను. ఈ ఏడాది రెండు ఎకరాల్లోసాగు చేయగా, మొత్తం 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గడ్డ నాణ్యంగా ఉండటంతో కర్నూలు మార్కెట్‌కు తీసుకెళ్లగా క్వింటాలుకు రూ. 3800 చొప్పున ధర లభించింది. అధిక వర్షాలతో కొంత ఇబ్బంది పడినా, మార్కెట్లో మంచి ధర పలకడంతో ఉపశమనం కలిగింది.

అమ్ముకునేందుకూ అవస్థలు

ఆరు గాలం కష్టపడి ఉల్లి సాగు చేసినా, వచ్చిన దిగుబడిని అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. గతంలో వ్యాపారులు అలంపూర్ చౌరస్తాలో ఉల్లి కొను గోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ లావా దేవీలకు ఆసక్తి చూపకపోవడంతో కొనుగోలు కేంద్రాన్ని ఎత్తేశారు. దీంతో ఉల్లిగడ్డలను విక్ర యించేందుకు కర్నూలు లేదా చిలకలూరిపేట మార్కెట్లకు వెళ్లాల్సి వస్తోంది. ఆయా ప్రాంతా ల్లోనూ ఉల్లి సాగు అధికంగా ఉండటం, మా ర్కెట్‌కు అధిక దిగుబడులు వస్తుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కర్నూలు మార్కెట్‌కు ఉల్లిగడ్డలు అత్యధికంగా రావడంతో మార్కెట్లో స్థలం సరిపోలేదు. దీంతో ట్రాక్టర్లను గంటల తరబడి రోడ్లపైనే నిలిపి వేశారు. దీంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

అధిక వర్షాలతో తెగులు



లింగస్వామి, రైతు, ఉండవల్లి : నేను ఈ ఏడాది 2.30 ఎకరాలల్లో ఉల్లి పంటను సాగు చేశాను. మొదట్లో బాగానే ఉన్నా, ఆ తర్వాత అధిక వర్షాలు కురవడంతో సగం పంట మురిగిపోయింది. కొంత కోతకు గురయ్యింది. అదే సమయంలో మజ్జిగ తెగులు ఆశించడంతో దిగుబడి తక్కువగా వచ్చింది. 100 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని ఆశించగా, 67 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. కానీ మార్కెట్లో రూ.3,960కి అమ్మడంతో పెట్టుబడి పోను ఇరవై వేల రూపాయలు మిగలడంతో ఉపశమనం కలిగింది.



ఉండవల్లి మండలంలో రైతులు సాగు చేసిన ఉల్లి పంట (ఫైల్)

క్రైం కార్నర్

బంగారం, వెండి చోరీ

ఊర్కొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని మాదారం గ్రామంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ కుర్మయ్య తండ్రి ఆంజనేయులు ఇటీవల మృతి చెందాడు. దశదిన కర్మ అనంతరం నిద్ర చేసేందుకు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. అదే రోజు రాత్రి వారి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడినట్లు పక్కింటి వారు గమనించి, కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో పరిశీలించగా, రెండు తులాల బంగారం, ఇరవై తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు కురుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెబ్బేరు ,నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ పరిధి లోని చెలిమిల్ల గ్రామానికి చెందిన ధూపం పెద్దయ్య (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధూపం పెద్దయ్య సోమ వారం కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ, మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో అడ్డ పంచెతో ఉరి వేసుకొని కన్పించాడు. అతడి మృతిపై అనుమానాలున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి జాతరలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వృద్ధుడు (70) మృతి చెందాడు. మైదానంలోని సబ్‌స్టేషన్ వెనుక ఆయన మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం, కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని న్యూ టీచర్స్ కాలనీలో నివసిస్తున్న గన్నోజు భాస్కరాచార్య భార్య శిల్ప సోమవారం మధ్యాహ్నం గుడికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రోజు గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

53 మంది కూలీలకు గాయాలు

» కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద బొలెరో బోల్తా
» 35 మందికి గాయాలు, వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలు
» ముగ్గురి పరిస్థితి విషమం, హైదరాబాద్‌కు తరలింపు
» జడ్చర్ల మండలంలో మరో ప్రమాదం
» 18 మందికి గాయాలు



కనిమెట్ట శివారులో బోల్తా పడిన వాహనం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు

కొత్తకోట/ జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరులో మంగళవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో 53 మంది కూలీలు గాయపడ్డారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని బూత్కూర్ గ్రామానికి చెందిన 35 మంది మహిళా కూలీలు పని కోసం మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలోని వర్నె, ముత్యాలంపల్లి, వెంకంపల్లి గ్రామాలకు బొలెరో వాహనంలో బయలు దేరారు. జాతీయ రహదారిపై కనిమెట్ట గ్రామ శివారులో వాహనం టైర్ పంక్చరై బోల్తా పడింది. సమీపంలో ధాన్యం తూకాలు వేస్తున్న హమాలీలు గమనించి, కూలీలను వాహనంలో నుంచి బయటకు తీశారు. పోలీసులకు సమాచారం అందించడంతో పాటు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. దీంతో ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన అబ్బులమ్మ, రేణుకమ్మ, జయమ్మ, సావిత్రి, చిట్టెమ్మలను మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్‌వీఎస్ ఆసుపత్రులకు తరలించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న అబ్బులమ్మ, జయమ్మలను హైదరాబాద్‌కు, రేణుకమ్మను కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

పెద్ద ఆదిరాల వద్ద ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం పెద్దఆదిరాల శివారులో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి, 18 మంది కూలీలు గాయపడ్డారు. పెద్ద ఆదిరాలకు చెందిన ఓ రైతు పొలంలో పత్తి తీసేందుకు 18 కూలీలు ట్రాక్టర్ ట్రాలీలో వస్తుండగా, గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దీంతో ట్రాలీలో ఉన్న కూలీలు గాయపడ్డారు. వారిని జడ్చర్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు లలితమ్మ, సుజాత, అనిత, సుజాత, జంగమ్మ, కృష్ణవేణి, ఊర్మిళ, ఎల్లమ్మ, కృష్ణమ్మలను బీఆర్ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, రఘుపతిరెడ్డి, శంకర్‌నాయక్, రామలింగారెడ్డి, సురేశ్, యాదయ్యతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.



బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెట్టు మెట్టుకు దీపం, బొట్టు

» మొక్కులు తీర్చుకుంటున్న మహిళా భక్తులు
» వైభవంగా కొనసాగుతున్న కురుమూర్తి బ్రహ్మోత్సవాలు

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి క్షేత్రంలో భక్తులు మెట్టు మెట్టుకు బొట్టు పెట్టి, దీపం వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారిని దర్శించుకునేందు మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గుట్ట మీదున్న క్యూ లైన్లలో రద్దీ కనిపించింది. జాతర మైదానంలో భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించారు.



మెట్టు మెట్టుకూ దీపం వెలిగిస్తున్న మహిళలు



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న మహిళా భక్తురాలు



హుండీలోని నగదును లెక్కిస్తున్న భక్తులు

కురుమూర్తి హుండీ లెక్కింపు

» సమకూరిన రూ 25.54 లక్షలు

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర ఆలయంలో హుండీలను మంగళవారం లెక్కించారు. రూ. 25,54,805 ఆదాయం సమకూరినట్లు ఈవో మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు భారతి, నెల్లి ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శేఖర్, భాస్కరాచారి, కమలాకర్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



పశువుల కాపరులు జాగ్రత్తలు పాటించాలి

» మండల పశువైద్యాధికారి మహదేవ్

మరికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువులకు వైద్యం చేయడమే లక్ష్యంతో పని చేస్తున్నామని మండల పశు వైద్యాధికారి మహదేవ్ తెలిపారు. పశుకాపరులు జాగ్రత్తలు పాటించాలని మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని గొర్రెలు, మేకలు ఉన్నాయి?

మండలంలో 1.50లక్షల గొర్రెలు, ఆరు వేల మేకలు ఉన్నాయి.

గాలికుంటు వ్యాధి టీకాలు ఎన్ని రోజులు వేస్తారు?

గతనెల 15వ తేదీ నుంచి ఈనెల 14 వరకు టీకాలు వేస్తున్నాం. కాపరులు పశువులకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలి.

మండలంలో గ్రామీణ పశువైద్యశాలలు ఎన్ని ఉన్నాయి?

పసుపుల, కన్మనూర్‌లో గ్రామీణ పశు వైద్యశాలలు ఉన్నాయి.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

పశువుల సంభవించే అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

పశువులకు ఏ వ్యాధులు ఎక్కువగా వస్తాయి?

చర్మవ్యాధులు పశువులకు అధికంగా వస్తాయి.

న్యూస్ బాక్స్

రేషన్ బియ్యం పట్టివేత



మద్దూర్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం

మద్దూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు. పట్టణానికి చెందిన నూరోద్దీన్ గ్రామాల్లో సేకరించిన రేషన్ బియాన్ని కర్ణాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. టాస్క్‌ఫోర్సు అధికారుల దాడుల్లో బియ్యం పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. పంచనామ అనంతరం స్థానిక రేషన్ దుకాణాన్ని అప్పగిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ తెలిపారు.

నేడు సదర్ ఉత్సవాలు

కోస్గి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించే సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలని యాదవ సంఘం అధ్యక్షుడు హన్మంతు మంగళవారం తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2గంటలకు వేణుగోపాలస్వామి ఆలయం నుంచి సదర్ ర్యాలీ ప్రారంభమై రామాలయం శివాజి కూడలి మీదుగా కొనసాగుతుందని, అనంతరం సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఐకేపీ కేంద్రాల ద్వారా వరి కొనుగోలు చేయాలి

నారాయణపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల ద్వారా వరి కొనుగోలు చేయాలని కోరుతూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య, గోపాల్ మంగళవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు మేలు కలుగుతుందన్నారు. శివకుమార్, అరుణ్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళా శక్తి కమిటీ ఎన్నిక

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ఆదర్శ మహిళా శక్తి పట్టణ సమాఖ్య (టీఎల్ఎఫ్) కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొన్నేళ్లుగా ఈ సమాఖ్యలో కొందరు మాత్రమే సభ్యులుగా చెలామణి అవుతూ ఏకపక్ష నిర్ణయాలతో అర్హులైన మహిళలకు చోటు కల్పించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సాయికుమారి, కార్యదర్శిగా యాదమ్మ, కోశాధికారిగా ఉమ, సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ధన్వాడ ఏవోగా నవీన్‌కుమార్

ధన్వాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా నవీన్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఏవో మాట్లాడుతూ.. మండలంలో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి అమ్ముకోవాలని సూచించారు.

ధాన్యం ఆరబోతకు కష్టాలు

» కల్లాలు లేక రోడ్లపైనే ఆరబోస్తున్న రైతులు
» గతంలో కల్లాల నిర్మాణాలకు నిరాసక్తి
» రోడ్లపై ఆరబెట్టడంతో ప్రమాదాలు



మరికల్ మండలం చిత్తనూరులో కల్లాలు లేక ఊరి బయట ఆరబోసిన వరి ధాన్యం

మరికల్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు పూర్తయ్యే వరకు ధాన్యం రోడ్లపైనే ఉంటుంది.. ధాన్యాన్ని అమ్మే ముందు తేమ లేకుండా చేసేందుకు ఆరబెట్టాలి. ఇందుకోసం క్షేత్రాల్లో కల్లాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ రైతులు అందుకు సుముఖంగా లేరు. గతంలో పోలిస్తే పదేళ్లలో సాగు నాలుగింతలు పెరిగింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో పుష్కలమైన సాగునీరు, ఉచిత విద్యుత్ సరఫరా కల్పించడంతో సాగుపై రైతాంగానికి ఆసక్తి పెరిగింది. దీంతో ఎటుచూసినా రెండు సీజన్లలో సస్యశ్యామలంగా కనిపిస్తోంది. పంట సాగు పెరిగిన కొద్ది అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలను రైతాంగం ఎంచుకో లేకపోయింది. వానాకాలం సీజన్ వరి కోతలు చేపట్టిన ధాన్యం ఆరబెట్టేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో ఎక్కడ ఖాళీ స్థలముంటే అక్కడ ఆరబోస్తున్నారు. పలువురు సమీపంలోని రోడ్లపై పోస్తున్నారు. ఇతర గ్రామాల్లో రోడ్లతో పాటు క్రీడా ప్రాంగణాల్లో ధాన్యం ఆరబెడుతూ కుప్ప చేస్తున్నారు. ఆ కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి రాళ్లు పెడుతున్నారు. రాత్రి వేళల్లో కనిపించక వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.

గతంలో కల్లాల నిర్మాణం

గతంలో రైతులు కల్లాలను నిర్మించుకునేందుకు ఉపాధి హామీ పథకం కింద అవకాశం కల్పించారు. కొంత మంది నిర్మించుకున్నప్పటికీ, బిల్లులు ఆలస్యంగా మంజూరు కావడంతో మిగతా రైతులు ఆసక్తి చూపలేదు. పొలంలో కల్లం నిర్మించుకుంటే స్థలం వృథా అవుతుందన్న కారణంతో మరికొందరు నిర్మించుకోలేదు. కల్లాల నిర్మాణాన్ని ప్రోత్సాహించాల్సిన ప్రభుత్వం రెండేళ్లుగా నిధులు కేటాయించడం లేదు. ఉపాధి పథకం నుంచి కల్లాల నిర్మాణాన్ని తొలగించడంతో రైతులకు రోడ్లే దిక్కయ్యాయి.

కల్లాలు లేకనే..



కల్లాలు లేకపోవడంతో వడ్లను కొనుగోలు కేంద్రాలకు సమీపంలో రోడ్లపైనే ఆరబోస్తున్నాం. హార్వెస్టర్ కోసే సమయంలో ట్రాక్టర్ అవసరం ఉంటుంది. పొలాల వద్ద ఆరబెట్టిన తర్వాత మరోసారి కొనుగోలు కేంద్రం వద్దకు వడ్లను తేవాలంటే ట్రాక్టర్‌కు ఖర్చు అవుతుంది.

- రాంరెడ్డి, రైతు, పూసల్‌పహాడ్

ప్రభుత్వం నిధులివ్వాలి



పొలాల వద్ద కల్లాలు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. అందుకు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తే బాగుంటుంది. కొనుగోలు కేంద్రాల వద్ద తొందరగా కొనుగోలు జరగకపోవడంతో రోడ్లపై ఆరబోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

-కృష్ణారెడ్డి, రైతు, అప్పంపల్లి

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ముఖ్యమైన విద్యా, వైద్య అత్యవసర సేవలు అందించడంలో రాజకీయాలు చేయమని, అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందిస్తామని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ బెనాషలోంతో కలిసి 138 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, సలీం, కౌన్సిలర్లు మహేష్, అమిరోద్దిన్, విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఈదప్ప, వెంకట్రామరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే

సర్వేలో భాగంగా జిల్లా కేంద్రంలోని నివాసంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మునిసిపల్ కమిషనర్ సునీత, ఎన్యుమరేటర్లకు తమ వివరాలు వెల్లడించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నారాయణపేట టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ చిన్నపిల్లల ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎక్లాస్‌పూర్ గ్రామ శబరి మహిళా సంఘం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. మొత్తం రూ.8.50లక్షలతో క్యాంటీన్ ఏర్పాటు చేసిన్నట్లు నిర్వాహకులు ఎమ్మెల్యేకు తెలిపారు. కోశాధికారి చంద్రకళ, లక్ష్మి, ఏపీఎం, సీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

మక్తల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ సహకార సంఘం గోదాంలో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ మేనేజర్ రాములు తెలిపారు. యాసంగిలో వరిసాగు చేసే రైతులు విత్తనాలు తీసుకోవచ్చన్నారు. 1010 లావు రకం, కేఎన్ఎం సన్నరకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆధార్, పాస్‌బుకు జిరాక్సు ప్రతులు తీసుకువచ్చి నిర్దేశించిన రుసుం చెల్లించి తీసుకోవాల్సిందిగా కోరారు.

ధాన్యం కొనుగోళ్లు పరిశీలన

పట్టణ సమీపంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ మేనేజర్ రాములు సందర్శించి మాట్లాడారు. రైతులు తేమశాతం పరీక్షించుకొని మద్దతు ధర పొందాలన్నారు. మండలంలో మొత్తం తొమ్మిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని డీఎస్పీ లింగయ్య తెలిపారు. కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా పోలీస్ అధికారుల నేర సమీక్షలో మాట్లాడారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులు చేధించాలన్నారు. అత్యాధునిక టెక్నాలజి ఉపయోగించి కేసుల పరిశోధనలు చేయాలన్నారు. అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు తనిఖీ చేయాలన్నారు. పాత నేరస్తులపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో సీఐలు శివ శంకర్, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, దస్రు నాయక్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మీరెడ్డి, కుర్మయ్య, మరళి, రామ్‌లాల్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధన్వాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నారాయణపేట జిల్లా జట్టు తరపున కొండాపూర్ విద్యార్థులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 7 నుంచి 9 వరకు రాష్ట్రస్థాయి బాలుర పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ రామ్మోహన్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య నాయక్, అంజనేయులు అభినందించారు.

మహిళలు, విద్యార్థినులకు అండగా షీటీం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

మాగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు, విద్యార్థినులకు ఎవరైనా లైంగి కంగా, మానసికంగా వేధిస్తే సమాచారం ఇవ్వాలని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని షీటీం సభ్యుడు బాలరాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మహిళలకు, విద్యార్థులకు అండగా షీటీం పని చేస్తుందని, అత్యవసర సమయంలో 8712670398కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. చోరీలు జరగకుండా భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీధర్‌రెడ్డి, రాకేష్‌శర్మ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : బీజేపీ

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా సంస్థాగత ఇన్‌చార్జి ఉదయభాను పిలుపునిచ్చారు. మంగళవారం ఫంక్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంస్థాగత ఎన్నికల్లో పార్టీకోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. మెజార్టీ స్థానాలు కైవసం కోసం కార్యకర్తలు పనిచేయాలన్నారు. సమావేశంలో సిద్ది వెంకట్రాములు, నందు నామాజీ, వెంకట్రాములు, రాము, సైదప్ప, కృష్ణ, పాండు తదితరులున్నారు.

చెరువులో చేప పిల్లలు విడుదల

మాగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మత్స్యకారుల సంఘం సభ్యుడు ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పెద్ద చెరువులో చేప పిల్లలను చెరువులో వదిలారు. 39వేలను వదలాల్సి ఉండగా, 26వేల చేప పిల్లలను వదిలారు. మూడు రోజుల్లో మిగతా వాటిని వదులుతామని మత్స్యశాఖ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణయ్య, సురేష్, నరేష్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నారాయణపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మెర్సీ వసంత మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడాకారులు అశోక్, కమలాకర్, సోనాలిక, నిఖితలను అభినందించారు. కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే పోటీలో వీరు పాల్గొంటారన్నారు. ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాల కేంద్రాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ తెలిపారు. మంగళవారం బాలకేంద్రంలో నిర్వహించిన బృంద పాటల పోటీల్లో పది బృందాలు పాల్గొన్నాయి. వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న కళలకు జీవం పోస్తున్నది బాలకేంద్రాలే అని తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్‌ను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు.

ప్రైవేట్‌గా అమ్మకానికే రైతుల ఆసక్తి

ధన్వాడ, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింగిల్ విండో ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పది రోజులు గడిచినా మంగళవారం నాటికి ఒక్క గింజ కొనలేదు. గోటూర్, ధన్వాడలో విండో ద్వారా, కిష్టాపూర్, కొండాపూర్‌లో మహిళా సమాఖ్య ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో ప్రారంభించిన కేంద్రాలకు ఇప్పటికి రైతులు ధాన్యాన్ని తీసుకురాలేదు. ఇంతకుముందు విండో సిబ్బందే నేరుగా రైతులు కల్లాల వద్దకు వెళ్లి తూకం వేసి కొనేవారు. ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి అమ్మాలన్న నిబంధనతో వెనకడుగు వేస్తున్నారు.

దాడులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న టీజీవో నాయకులు, అధికారులు

నారాయణపేట టౌన్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులపై గ్రామస్థులు దాడి చేయడాన్ని జిల్లా రెవెన్యూ ఆయా శాఖల అధికారులు ఖండించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అధికారులపై దాడులకు పాల్పడితే నష్టపోయేది ప్రజలేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలంటే అధికారుల కృషి ఎంతో అవసరం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులు కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో రాంచందర్, డీపీఆర్వో రషీద్, తహసీల్దార్ శ్రీను, రామకృష్ణగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

లగచర్ల ఘటనపై విచారణ జరిపించాలి

» బీజేపీ నేత నాగూరావు నామాజీ



మాట్లాడుతున్న నాగురావు నామాజీ

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిపై న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ నేత నాగూరావు నామాజీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు తమ ఇళ్లు, భూములు కోల్పోతారని ఆక్రోశంలో ఉన్న తరుణంలో గ్రామానికి కలెక్టర్‌ను పంపడం సరైంది కాదన్నారు. డీజీపీ ఈ దాడి ముందస్తు ప్రణాళికతో జరిగిందని ప్రకటించడం వారి నిస్సహాయతకు నిదర్శనం అన్నారు. 12 రోజులైన కొనుగోలు కేంద్రాల్లో వరి కొనడం లేదన్నారు. మిల్లర్లనే కొనుగోలు కేంద్రాలకు పంపించి తేమ శాతం చేసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మరికల్ మండలంలోని 17 గ్రామాల్లో రూ.2.70 కోట్ల అవినీతి ఉపాధి పథకంలో జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పనులపై విచారణ జరిపించి అవీనితి పరులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» డీఈవో అబ్దుల్ గని



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న డీఈవో అబ్దుల్ గని

నారాయణపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో అబ్దుల్ గని అన్నారు. మంగళవారం ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు మండలంలోని జాజాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో విద్యార్థులను పరిచయం చేసుకుని మాట్లాడారు. విద్యార్థులు గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు క్రీడల్లో ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భారతి, డీఎస్‌వోహెచ్ భానుప్రకాశ్, డీవైఎస్‌వో వెంకటేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, సాయినాథ్, మణెమ్మ, రత్నయ్య, రమణ పాల్గొన్నారు.

జాజాపూర్ పాఠశాల తనిఖీ

మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పదో తరగతి స్పెషల్ క్లాసులు, వెనక బడిన విద్యార్థుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అందరూ ఉత్తీర్ణులయ్యేలా చూడాలని ఆదేశించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఊట్కూర్: వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అన్నారు. మంగళవారం మండలంలోని నిడుగుర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల విద్యా ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పాఠశాలలో ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలివ్వాలి

దామరగిద్ద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గతేడాది ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సభ్యురాలు సమీన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలు ఇచ్చి తీరా రూపాయి పావలా వడ్డీ విధించినట్లు తెలిపారు. మండలానికి రూ. 6కోట్ల వడ్డీ డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జోషి, నారాయణమ్మ, దానమ్మ, ఆశమ్మ, పుష్ప, సాయమ్మ, నిజాంబి, కాషమ్మ, నాజియా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని మునిసిపాలిటీలో విలీనం చేయొద్దు



వినతిపత్రం ఇస్తున్న రెనివట్ల గ్రామస్థులు

మద్దూర్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేయబోయే మద్దూర్ మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని మండలంలోని రెనివట్ల గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే వ్యవసాయ ఉపాధి అవకాశాలు కోల్పోవడంతో పాటు, పట్టణంగా పరిగణలోకి తీసుకుని సబ్సిడీ రుణాలు, ఉపకార వేతనాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. శంకర్, నారాయణ, కన్కప్ప, హాజర్, గోపాల్, అంజి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు కాంగ్రెస్ నాయకులు సహకరించాలి



మాట్లాడుతున్న చంద్రకాంత్‌గౌడ్

మక్తల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో సర్వేకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బోయ రవికుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేకు వార్డులను సమన్వయం చేసుకొని అన్ని కుటుంబాలకు సంబంధించిన వివరాలను ఇవ్వాలన్నారు. పట్టణంలోని 16వార్డులకు గాను కాంగ్రెస్ కార్యకర్తలు వలంటీర్లుగా ఏర్పడి ఎన్యూమరేటర్లు, వార్డు ఆఫీసర్లకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నారాయణ, లక్ష్మణ్, రాము, మల్లేష్, రాములు, నీలగౌడ్, నాగరాజు, శంషొద్దీన్, రాము, దండు ఆనంద్, చిన్నయ్య, రమేష్, నయ్యిం, మొహ్మద్ రఫీ, మహేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశి పూజలు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉత్తరాదిమఠం వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ శోభన మహిళా భజన మండలి సభ్యులు హరిదాసుల సంకీర్తనలతో భజనలు చేశారు. కార్యక్రమంలో హరిష్ ఆచార్య, కోప్రేష్ ఆచార్య తదితరులున్నారు.

బ్యాంకులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లావాదేవీలకు వచ్చే వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కెనరా, ఎస్‌బీఐ బ్యాంకులలో వినియోగదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. అధిక మొత్తంలో డబ్బులు బ్యాంకుల నుంచి తీసుకెళ్లే సమయాల్లో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసే సమయంలో కొత్త వ్యక్తులకు కార్డులు ఇవ్వరాదన్నారు. బ్యాంకుల వద్ద దొంగలు మాటు వేసి చోరీలకు పాల్పడే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.